# ఇంకా ఏం చెప్పాలి?

కోర్టుకు వెళ్ళబోతున్న నాన్న గారి ముందుకొచ్చి నిలబడ్డాను.

"అయితే ఈ రోజే ప్రయాణం అన్న మాట?" కోటు జేబులోనుంచి డబ్బు తీస్తూ అన్నారు నాన్నగారు.

'సాయంకాలం ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరుతున్నానని టెలిగ్రాం కూడా ఇచ్చాను. సంతానం బాబాయి స్టేషన్ క్కూడా వస్తారు!'

"అలాగే వెళ్ళిరా. నాలుగు రోజుల్లో వచ్చేయ్!" అంటూ రెండు వందలు తీసి ఇచ్చారు. ఓ క్షణం ఆగి మరో వంద రూపాయల నోటు అందిస్తూ, 'చూడమ్మా! యీ వంద తీసుకెళ్ళి సంతానం పిల్లలకు ఏమన్నా పట్టుకెళ్లు!' అన్నారు.

నా సంతోషానికి అంతులేదు. నాన్నగారు వెళ్ళగానే షాపింగ్ చేయటానికి బయలుదేరాను బజారుకు.

ఇంతకీ సంతానం బాబాయి పిల్లలకు ఏం తీసుకెళితే బాగుంటుంది ? అవును ! ఆయనకు ఎంతమంది పిల్లలు ? ఇద్దరు కదూ ! ముగ్గురేమో ! సంతానం బాబాయిని కానీ ఆయన కుటుంబాన్ని కానీ చూసి పదేళ్ళపైగా అయింది. విశాఖపట్నంలో వున్నప్పుడు వాళ్ళ కుటుంబానికి ఎంతో సన్నిహితంగా వుండేవాళ్ళం. మా నాన్నగారూ, సంతానం గారూ కలిసి చదువుకున్నారట. అంతే కాకుండా అన్నదమ్ముల్లా మెలిగేవారట. నేను ఆ స్నేహాన్ని పురస్కరించుకొనే ఆయన్ను 'బాబాయ్' అని పిలుస్తూ వుండేదాన్ని. ఆయన భార్య పేరు తులశమ్మ. ఆమెను 'పిన్ని' అనేదాన్ని. మా నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు నేను వాళ్ళ యింట్లో వుండే చదువుకున్నాను. పరీక్షలయేంతవరకు.

ఇంతకీ సంతానంగారికి ఆ ఇద్దరు పిల్లలేనా ? పెద్దమ్మాయి శారద. దానికిప్పుడు పందొమ్మిది, ఇరవై ఏళ్ళు వుండొచ్చు. యేం చదువుతూందో ! తర్వాత వాడి పేరు వెంకు...అదే వెంకట్రావు అనుకుంటాను. మేము విశాఖనుంచి వచ్చేటప్పటికి తులశమ్మ పిన్ని కడుపుతో వున్నట్లు గుర్తు. కనుక ఇద్దరూ లేక ముగ్గురు పిల్లలు ఖచ్చితంగా వుండే వుంటారు.

శారదకు చీరా బ్లౌజు పీస్ తీశాను. వెంకుగాడికి టెర్లిన్ షర్ట్ తీశాను. పుల్లారెడ్డి షాపులో రెండు కేజీలు మిఠాయి కొన్నాను.

మొత్తంమీద నాన్నగారిచ్చిన వంద రూపాయలూ ఖర్చు పెట్టాను.

సాయంకాలం గోలుకొండ ఎక్స్‌ప్రెస్‌లో బయలు దేరాను. రాత్రి పది గంటలకు ఎక్స్‌ప్రెస్ బెజవాడకు చేరుతుండగా నాకు అదురు పుట్టుకొచ్చింది. నా టెలిగ్రాం అందిందో లేదో! సంతానంగారు ఒకవేళ స్టేషన్‌కు రాకపోతే! అంత వచ్చినా ఆయన నన్ను గుర్తుపట్టగలరా? నన్నెప్పుడో పదేళ్ళ క్రితం చూశారు. అప్పుడు నాకు పదిహేనేళ్ళు. చాలా మారిపోయి వుంటాను. ఏమైనా సంతానంగార్ని నేను గుర్తుపట్టగలననే ధైర్యంతో బండి దిగాను.

ఆయనలో కూడా కొంత మార్పు వచ్చే వుంటుంది. నేను వైజాగ్‌లో వున్నప్పుడు ఆయన ఆఫీసులో గుమాస్తా మాత్రమే. మొన్న నాన్నగారు చెప్పారు సంతానం ఇప్పుడు హెడ్ క్యాషియర్ అయ్యాడని. సంతానంగారికి ఆ గుమాస్తాగిరినుంచి ప్రమోషన్ వచ్చేదానికి ఐదు సంవత్సరాలు ముందే నాన్నగారు మాజిస్ట్రేట్ అయ్యారు. అది కూడా నాన్నగారు అదృష్టంకిందే జమకట్టేశారు.

ఏమైనా సంతానం వున్నదాంట్లో సంతృప్తిచెందే మనిషనీ, దైవ భక్తుడనీ, దేవుడిచ్చినదాన్ని ఇచ్చినట్లు స్వీకరించాలనే మనస్తత్వం కలవాడనీ, నాన్నగారు అయన్ని తెగ మెచ్చుకుంటూ వుంటారు.

' ఏమ్మా ప్రయాణం సౌకర్యంగా సాగిందా ? '

ఆ మాట వింటూనే తలెత్తి చూశాను. ఎదురుగా సంతానంగారు. ఆయనలో పెద్ద మార్పేమీ లేదు. ఎప్పుడూ మెరిసే ఆ కళ్ళలో కొంత మందగొండితనం మాత్రం కనిపించింది.

' నాన్నగారు కులాసాగా వున్నారా ? '

' ఆఁ ! కులాసాగానే వున్నారు. ముందు ఇద్దరం కలిసే రావాలనుకున్నాం. కాని.... ' నా మాట పూర్తికాక ముందే " ఆఁ అంటాడేకాని ఆయన కెక్కడ తీరుబడి వుంటుందమ్మా ! నేను బెజవాడ వచ్చిందగ్గర్నుంచీ ఇదిగో వస్తా అదిగో వస్తా అంటూనే కాలం గడిపేశాడు. ఫోనియ్ లేమ్మా ! నిన్నయినా పంపించాడు ! తులసి నిన్నెప్పుడూ కలవరిస్తూంటుంది " అన్నాడు. అంత ఆప్యాయతతో మాట్లాడుతున్న బాబాయిని చూస్తే అతనిలోని మంచితనం ఇంకా అలాగే వున్నట్టునిపించింది.

' అవును బాబాయ్ ! పిన్ని ఆరోగ్యం ఎలా వుంది ? ' అడిగాను.

"బాగానే వుందమ్మా !" అని సామాను పోర్టర్‌కు అందించి స్టేషన్ బయటకు దారితీశాడు.

ఓ అరగంట ప్రయాణంచేసి, ఓ అయిదారు సందులు గొందులు తిరిగాక సంతానంగారి ఇల్లు వచ్చింది. బయట రిక్షాల చప్పుడు విని తలుపు తీసుకొని తులశమ్మ బయట కొచ్చింది. ఒకప్పుడు భర్తకంటే పదేళ్ళు చిన్నదిగా కన్పించే పిన్ని ఇప్పుడు పదేళ్లు పెద్దదిగా కన్పించింది. అయితే ఆమె మాటల తీరులో పెద్ద మార్పేమీ లేదు. సంతానంగారు నా లెదర్ సూట్‌కేసు భద్రంగా దింపించి, వరండా పక్కగావున్న గదిలో పెట్టించారు. అప్పటికే పిన్ని ఆ గదిలో నాకోసం అన్నీ సిద్ధంచేసి వుంచింది. ఆ గది గుమ్మం ముందే కాళ్ళూ చేతులూ కడిగించి ఆ గదిలోనే అన్నంపెట్టి కబుర్లు చెప్తూతూ కూర్చొంది.

'శారదా, వెంకూ ఎక్కడా ?' అన్నాను పిల్లలను చూడాలనే కుతూహలంతో.

తులశమ్మ పిన్ని నిండుగా నవ్వింది.

'నిద్దర్లకు పడ్డారు. రేపు ప్రొద్దున్నే చూద్దువుగాని లేమ్మా ? దూరా భారం ప్రయాణం చేశావు. ఇక పడుకో !' అని పిన్ని ఎంగిలి పళ్ళెం, గిన్నెలు తీసుకొని వెళ్ళిపోయింది.

సంతానంగారు వరండా తలుపు బిగించి ఓ చాపచుట్ట దులిపి వరండాలోనే నడుం వాల్చారు.

నేను పడుకున్న గది చాలా చిన్నది. నా మంచం పక్కనే పిన్ని చాప వేసుకొని పడుకొన్నది. నడుం వాలుస్తూనే నిద్రపోయింది. నాకు ఎంతసేపటికీ నిద్ర పట్టలేదు. ఆ గదిలో ఊపిరాడనట్టు అంతా కొత్త కొత్తగా అనిపించింది. పైగా నాకు వేసిన పరుపూ పక్క దుప్పట్లూ పసిపిల్లల వాసన వేస్తున్నాయి. పిన్నిగారింట్లో పసిపిల్లలు ఎవరై వుంటారో ఊహించలేకపోయాను. వారి కుటుంబాన్ని గురించి ఆలోచిస్తూ పడుకొన్నాను. మగత నిద్రలోనుంచి గాఢ నిద్రలోకి జారిపోయాను.

తెల్లవారి నిద్రలేచి చూసేసరికి చాలా ఎండెక్కినట్టని పించింది. గడియారం చూస్తే 8-30 అయివుంది.

తృళ్ళిపడి లేచి కూర్చున్నాను. గదిలో నా లెదర్ సూట్‌కేసు కన్పించలేదు. గాబరాపడి బయటకు వచ్చి ' పిన్నీ పిన్నీ ' అంటూ వరండా దాటి హాల్లోకి వచ్చాను. తలుపు పక్కగా నిలబడివున్న—పిల్ల – అదే శారద అయి వుంటుంది. సిగ్గుపడుతూ ' గోలుకొండలో వచ్చావా అక్కయ్యా ! ' అని పలకరించింది.

' అవును ! చాలా పెద్దదానివయిపోయావ్ ? ' అన్నాను. ఆ పిల్ల సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ కిసకిసా నవ్వింది.

'అమ్మ ఎక్కడా?' అంటూ నాలుగడుగులు ముందుకు వేశాను. కరెంట్ షాక్ తగిలినట్టు నిలబడి పోయాను.

నా కొత్త సూట్‌కేసు అతి దీనంగా పిల్లల కాళ్ళ సందులనుంచి తొంగి తొంగి నా కేసి చూస్తూన్నట్టనిపించింది. నలుగురు పిల్లలు—సైజులువారిగా వున్న ఆ నలుగురు నా పెట్టె గట్టితనాన్ని పరీక్షిస్తున్నారు. మూడేళ్ళది ఒకాతి దానిమీద కూర్చొని వున్నది. ఐదేళ్ళవాడు ఒకడు దానిమీద నిల్చొని డ్రైవర్ మాదిరిగా చేతులు తిప్పుతున్నాడు. అంతకంటే పెద్దవాళ్ళు ఇద్దరు దాన్ని బరబరా గుంజుతున్నారు. ఒక్క దూకులో నా పెట్టె దగ్గరకు వచ్చి పడ్డాను. అప్పటికే అది సగం వంగిపోయింది. దాని హాండిల్ ఒక వైపున ఊడిపోయింది. నన్ను చూసిన పిల్లలు ఒక క్షణం ఆగి, ఆ పెట్టెను చూసినట్టే నన్ను వింతగా చూసి మళ్ళీ గుంజటం మొదలు పెట్టారు. ఎవరు వీళ్ళంతా? ఒక్కొక్కళ్ళనే చితకగొట్టి పారేద్దామన్నంత కోపం వచ్చింది.

"ఉండండి బాబులూ!" అంటూ వాళ్ళబారినుండి సూట్‌కేసును రక్షించడానికి ప్రయత్నించాను. లాగుతున్న వాళ్ళు వదిలేసి నిలబడ్డారు. కాని పెట్టెమీద కూర్చున్న వాళ్ళు మాత్రం ససేమిరా దిగలేదు. అంతలో అంతకు

ముందు కన్పించిన అమ్మాయి శారద దేవతలా వచ్చి నన్ను ఆదుకొంది. పెట్టెమీద నిలబడ్డ బుడ్డోణ్ని ఒక తీత తీసి, కూర్చున్న బుడ్డదాన్ని లాగి కిందకు గుంజేసింది. ఆ అమ్మాయీ, నేనూ కలిసి సి. ఆర్. పి. వాడి దెబ్బలకు చతికిలబడిన సత్యాగ్రహిలా వున్న నా సూట్‌కేసును మళ్ళీ నా గదిలోకి చేరవేశాం. ఆ స్థితిలో వున్న నా కొత్త లెదర్ సూట్‌కేసును చూస్తుంటే నా గుండె చెరువయింది. ఎలాగో తమాయించుకొని పెట్టె తెరిచాను. చీరా, బ్లౌజ్ పీస్ తీసి శారదకు ఇచ్చాను. దాని ఆనందానికి అవధుల్లేవు.

'అమ్మా! అక్కయ్య నాకు చీర తెచ్చిందే?' అంటూ కేరింతలు కొట్టూ పరుగెత్తింది.

ముఖం కడుక్కుందామని బాస్కెట్ వెతికాను. బాస్కెట్ గదిలో ఓ మూలకు లాగివుంది. అందులోవన్నీ చిందర వందరగా పడివున్నాయి. బ్రష్ కన్పించలేదు. పేస్టుట్యూబ్ చితికిపోయి వుంది. అందులోనుంచి బయట కొచ్చిన పేస్టు దువ్వెనకూ, పౌడర్ డబ్బాకూ అతుక్కుపోయి వుంది. అలాగే నలిగిపోయిన ట్యూబ్‌ను పట్టుకొని బయటకు వచ్చాను.

ఎదురుగా పిన్ని వచ్చి "ఏమిటమ్మా వెతుకు తున్నావ్! మాయదారి పిల్లలు ఏదీ ఒక్కచోట వుండ నివ్వరు." అంది.

' బ్రష్ కనపట్టంలేదు పిన్నీ ! ' అన్నాను.

' ఓసేయ్ ! బేబీ ! అక్కయ్య బ్రష్ కనపట్టం లేదట ! ఆ గజ్జిగాడు తీశాడేమో చూడవే ! ' అని పిన్ని కేక వేసింది.

అరడజనుమంది యోధుల్లా బయలుదేరారు. మంచం కింద దాక్కునివున్న గజ్జిగాడ్ని వెతికి బయటికి లాగారు. వాడి చేతిలో బ్రష్ నలిగి ముద్దగా అసహ్యంగా వుంది. పిన్ని వాడికి రెండు తగిలించి బ్రష్ లాక్కుని శారదా అని కేక వేసింది. కొద్ది క్షణాల్లో ఓ పెద్ద నాపసానిలా వున్న అమ్మాయి వచ్చింది.

" అక్కయ్యా నేను గుర్తున్నానా ? " అంటూ నన్ను పలకరించింది. నాకు మతిపోయినంత పనయింది. ఈ పిల్లా శారద ? శారదకేసి పరీక్షగా చూశాను. గర్భిణితో వుంది. మనిషిలో నిండుతనం, పెద్దతనం కన్పించాయి.

" ఏమిటమ్మా అలా చూస్తావ్ ? శారదను గుర్తుపట్ట లేదా ? మా తమ్ముడికిచ్చి చేశాం. దానికి ఏడో నెల ! కాన్పుకు వచ్చింది ! " అన్నది తులశమ్మ పిన్ని.

" ఆఁ ! ఎందుకు గుర్తుపట్టలా ? పట్టాను ! " అంటూండగానే నేను ' శారద ' అనుకున్న పిల్ల వచ్చింది కొత్త చీర సింగారించుకొని.

"అక్కయ్యా! ఈ చీర నా కెలా వుంది!" అంది సిగ్గుపడుతూ. "పెళ్ళికూతురిలా వున్నావు" అన్నాను.

"ఛో! అక్కయ్యా" అంటూ అక్కడనుంచి తుర్రున పారిపోతున్న కూతురితో ముసిముసిగా నవ్వుతూ పిన్ని అంది, "అదేమిటే నీరదా! అప్పుడే కొత్త చీర కట్టావ్? అక్కయ్యా నువ్వా ఒక్కసారే కట్టుకొని నాన్నగారికి చూపిస్తే సంతోషపడేవారుగా?"

నేను గతుక్కుమన్నాను. ఇది నీరదా? నేను తెచ్చింది ఒక్కటే చీర. పెద్దదానికి తప్పకుండా తెచ్చి వుంటానని పిన్ని అభిప్రాయం. అది సహజమే కదా!

'అక్కా! శారదక్కయ్యకు తెచ్చిన చీర చూపెట్టవూ' అంటూ నీరద నా చెయ్యి పట్టుకొని గుంజింది.

"ఉండండర్రా మీరు! అమ్మాయిని మొహం కడుక్కోనివ్వండి. టిఫెన్ కూడా ఆరిపోతుంటేను!" అని పిన్ని అప్పటి గండాన్ని వాయిదా వేసింది.

బాత్‌రూంలోంచి మొహం కడుక్కొని బయటికి వస్తూంటే అంతకుముందు చూడని ముఖాలు రెండు ప్రత్యక్షమైనాయి.

కాఫీ తాగుతుంటే సూనూగు మీసాలవాడు ఒకడు వచ్చి 'అక్కయ్యా బాగున్నావా?' అని అడిగాడు.

ఇంకా ఏం చెప్పాలి?

వాడే వెంకూ—అదే వెంకట్రావు అనుకున్నాను. మళ్ళీ అనుమానం వచ్చింది. వీడు వాడి తమ్ముడు కాదు కదా! ఇంతలోనే ఓణీ వేసుకొన్నది ఒకాతి వచ్చి నా చేతిలోని ఖాళీ గ్లాసు అందుకొని చక్కా పోయింది. అయితే ఇంతకూ ఎంతమంది? లోలోపల గుణించు కొన్నాను. ఓసారి ఏడూ మరోసారి తొమ్మిది శాల్తీలు తేలినయ్!

'ఏమేయ్! సీరదా? చంటోడికి స్నానం చేయించాలి! ఎండెక్కి పోతుంది. వేడినీళ్ళు పెట్టి నలుగు పిండి పెట్టు!' అని వంట గదిలోనుంచి పిన్ని కేక వినబడింది.

అంటే తొమ్మిదీ ప్లస్ ఒకటన్నమాట!

'ముందు రామలక్ష్మణుగాళ్ళకు చేయించవే! చంటోడికి తర్వాత చూద్దాం!' అన్నది శారద.

చచ్చాం! మధ్యలో ఈ రామలక్ష్మణుగాళ్ళెవరు?

సాలెగూడులోని దారాల్లా నాకీ పిల్లల లెక్క తేలటం లేదు.

పిన్ని చీరకుచ్చిళ్ళు దోప్పుకొని తయారయింది పిల్లలకు స్నానాలు చేయించటానికి.

"పిన్నీ! ఇంతకూ ఎంతమంది?" చిన్నగా నా సందేహాన్ని జారవిడిచాను.

పిన్ని పళ్ళన్నీ బయటపడేసి ఆనందంగా నవ్వింది. "కుచేల సంతానమమ్మా! కుచేల సంతానం!" అని మార్షల్లా నిలబడి అందర్నీ—ఉసేయిల్నీ – ఉరేయిల్నీ – పేరు పేరున పిలిచి పెరేడ్ చేయించింది. ఐదు నిముషాల్లో పిల్లలతో హాలంతా నిండిపోయింది.

'ఇది సీరద, అది మంగా, ఇదిగో ఇదేమో పాప! వాడు రాఘవ, వీడు చంద్రం, వాడు చలం, అది మంగీ, వాడు గజ్జిగాడు. అదిగో అది బేబి—సరే అది శారద నీకు తెలుసు. ఒరేయ్ వెంకూ? అన్నట్టు వాడేడీ?' అంటూ వెంకూ కోసం పిన్ని కళ్ళు హాలంతా వెతకసాగాయి.

రెండు నిముషాల్లో వెంకట్రూవొచ్చాడు. బారుగా సన్నగా వున్నాడు. వాడు వయసుకు మించి పెరిగినట్టున్నాడు. చేతిలో సంచుల్ని దించి పెడుతూ 'అక్కయ్యా, నాన్నగారు కులాసాగా వున్నారా?' అన్నాడు.

ఇంతలో పిన్నికి ఏదో సందేహం వచ్చినట్టు 'ఒరేయ్! వాడేడిరా వెంకూ?' అన్నది.

అందరూ వెతికి బొగ్గులబస్తా చాటునుంచి నాలుగేళ్ళ వాడ్ని ఒకహడ్ని వెతికి తీసుకొచ్చారు. పిన్ని వాడి ముఖాన వున్న మసిని పమిట చెంగుతో తుడుస్తూ "వీడి తర్వాత వాళ్ళిద్దరూ కవలలు—రాముడూ—లక్ష్మణుడూ!" అన్నది.

సీరదా, బెబీ కవల పిల్లల్ని ఎత్తుకొచ్చి నిల్చున్నారు.

'అదుగో ఆ చంటోడేమో శారద కొడుకు !' పిన్ని చెప్పుకుపోతూ వుంటే చేతివేళ్ళను మడుస్తూ లెక్క వేశాను. రెండు చేతివేళ్ళూ పూర్తయాక ఇహ లెక్కవేయడం మానేశాను.

ఇంత చిన్న ఇంట్లో ఇంతమంది ఎలా వుంటున్నారు ? సంతానంగారి జీత మెంత ? ఇంతమందితో ఈ సంసారాన్ని ఎలా ఈదుకొస్తున్నారు ? నా ఆలోచన తెగకముందే సంతానంగారు కూరల సంచులు మోసుకొని వచ్చారు.

'కాఫీ అయిందమ్మా ?' అని పలకరించి "తులసీ, త్వరగా బాత్‌రూం శుభ్రం చేయించు ! అమ్మాయికి స్నానానికి ఆలస్యమయిపోవడంలా ?' అన్నారు.

'చంటోళ్ళ స్నానాలు అయ్యాక అరుణ చేస్తుంది లెండి ! ఇదిగో అర్థ గంటలో అయిపోతుంది !' అంటూ పిన్ని శారదనూ, నీరదనూ పురమాయించి బాత్‌రూంలోకి నడిచింది. సంతానంగారు షేవింగ్ సెట్టు తీసుకొని అద్దం ముందు కూర్చున్నారు.

నాకు ముందు ముగ్గురూ, వెనక ఇద్దరూ రాగా గదిలోకి దారితీశాను. మళ్ళీ పెట్టె ఎవడో బిగించివేశాడు. పావుగంట వెతికినా తాళం చేతులు కనిపించలేదు. వెంకట్రావ్ అట్లకాడ తెచ్చి ప్రయత్నిస్తే ఎలాగో పెట్టె తెరుచుకొంది.

పెట్టెలోనుంచి స్వీట్స్ ప్యాకెట్ బయటికి తీశాను. అట్ట పెట్టెలోవున్న స్వీట్స్ ఒకదానికొకటి అతుక్కుపోయి వున్నాయ్.

"ఇవిగో ఇంద! అందరూ సమానంగా తీసుకోండి!" నా మాట పూర్తికాకుండానే ఓ డజనున్నర చేతులు వాలాయి. గద్దలు తన్నినట్టు నా చేతుల్లోని స్వీట్సు ప్యాకెట్‌ను తన్నివేశారు. వాళ్ళు రాల్చిన పొడితో నా తల్లా, వళ్ళూ నిండిపోయింది. పది నిమిషాలు నా గదంతా అల్లకల్లోలం అయింది. గడ్డం చేసుకొంటున్న సంతానంగారు వచ్చి జుట్లు జుట్లు పట్టుకొన్న పిల్లల్ని వదిలించారు. చిన్న సైజు వాళ్ళను నేను విడదీశాను. ఆ బీభత్సంలో ఒకడి పళ్ళూ, మరొకడి గోళ్ళూ నా చేతుల మీద దిగిపోయాయి.

సంతానంగారు పెద్దగా అరిచి అందర్నీ నా గదిలో నుంచి బయటికి వెళ్ళమన్నారు. హైదరాబాదు పట్నంలో 144 లా అది వాళ్ళమీద యేమీ పనిచేయలేదు. నేనే గదిలోనుంచి బయటికి వచ్చాను. మరుక్షణంలోనే సంతానంగారు మామూలుగా అయ్యారు. ఆయనముందు కూర్చొని, లేని ఉత్సాహాన్ని తెచ్చుకొని కబుర్లు చెప్పసాగాను. అంతలో పిన్ని వచ్చి స్నానానికి లేవమంది.

చీరా, టవలూ తీసుకొని బాత్‌రూంకు వెళ్ళాను. నా వెనక ఇద్దరూ ముందు ఒక్కరూ నడిచారు. బాత్‌రూం తలుపు దగ్గర ఆగిపోయారు. వాళ్ళు నన్నలా చుట్టుకు చుట్టుకు తిరుగుతూ వుంటే నాకు తమాషాగా వుంది.

మొహం కడుక్కున్నప్పుడు వదిలేసిన నా సోప్ అక్కడ లేదు. మళ్ళీ తలుపు తెరిచి ఆ మాట నోటితో అనకుండా వెతకసాగాను. నా అవస్థ గ్రహించిన నీరద "అక్కయ్యా! నీ సోపే, మరే పాప అందులో జార విడిచింది" అంటూ మోరీకేసి చూసింది. అంతలో శారద మరో సోప్ కేసు తెచ్చి యిచ్చింది. ఆ సోపునిండా జుట్టూ, సున్నిపిండి, ఇసుకా అతుక్కొని వున్నాయి. ఆ సోపు తీయటానికి మనసొప్పక ఎలాగో స్నానం పూర్తి చేశాను.

తల దువ్వుకుందామంటే నా దువ్వెన కన్పించలేదు. ఆ దువ్వెనతో పాప చిక్కు తీసుకుంటూ కన్పించింది. దాని జుట్టులోనుంచి దువ్వెన బయటకు తీసేసరికి రెండు పళ్ళు ఊడొచ్చాయి.

పిన్ని స్నానంచేసి వచ్చేటప్పటికి ఒంటిగంట అయింది. భోజనాల దగ్గర ఓ సంతర్పణలా జరిగిపోయింది. అదంతా తమాషాగా వుంది. చెప్పొద్దూ అక్కడ మాత్రం నాకు సర్దాగానే వుంది. పిల్లల కంచాలూ, ఎంగిళ్లు దాటుకొని

బయటికి రావటం చంద్రగోళంమీద మొదటిసారిగా కాలు పెట్టిన మనిషి నడిచినట్లే అనిపించింది.

మధ్యాహ్నం పడుకోగానే ఓ కునుకు పట్టింది. ఆ సుఖం ఎంతసేపో పట్టలేదు. ఉలిక్కిపడి లేచాను. రేడియోలో బాలానందం ప్రోగ్రాం పెద్దగా పెట్టినప్పుడు వచ్చే ధ్వనులు వినబడ్డాయి. లేచి బయటకొచ్చాను. ఇంటి కప్పు ఎగిరిపోయేట్టు పిల్లలు అరుస్తున్నారు. అంత వరకూ నయం ఆరోజు బాలల ప్రోగ్రాం లేదు.

సాయంకాలం శారదను వెంటబెట్టుకొని బజారుకు బయలుదేరాను. రిక్షాలో ఎక్కిన పిల్లల్ని వదిలించుకునేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది. అందరికీ బిళ్ళలూ, బొమ్మలూ కొనితెస్తానని నచ్చచెప్పి పిల్లల్ని వదిలించుకొని శారదా, నేనూ బయటపడ్డాం. నా దగ్గరవున్న రెండొందల్లో మరొక వంద రూపాయలు ఖర్చుపెట్టా మనుకొన్నాను. శారదకు చీర కూడా కొన్నాను. బిల్లు చెల్లించి లెక్క చూసుకుంటే నూటపాతిక రూపాయలు అయినై.

పిన్నీ, సంతానంగారూ నేను అంత ఖర్చుపెట్టినందుకు నన్ను మందలించారు.

ఆ రాత్రి పిల్లలు అక్కయ్య దగ్గర నేను పడుకుంటా నంటే నేను పడుకుంటానని పోటీలు పడ్డారు. అందరికీ

నచ్చే ఉపాయం చెప్పి, హాల్లో చాపలమీద వాళ్ళమధ్య పడుకొన్నాను. పిల్లలతో కబుర్లు చెబుతూ పడుకుంటే నాకు చెప్పరాని ఆనందం కలిగింది.

అర్థరాత్రిపూట ఒకడు చెవులో నొప్పి అని యిల్లు ఎగిరిపోయేట్టు గల్లంతు చేశాడు. పిన్ని నూనె కాచి వాడి చెవిలో పోసింది. వాడు పడుకోగానే మరొకాతి ఒరగాలు నొప్పి అంటూ లేచి కూర్చుంది. తెల్లవారి కోడి కూసేంత వరకు ఎవరో ఒకారు వంతుల ప్రకారం లేచి కూర్చుంటూనే వున్నారు. తెల్లవారి ఒళ్ళంతా నొప్పులుగా వుంది. ఇంతకీ నేను వచ్చి ఎన్నాళ్ళయింది ? ఓరోజు గడిచేసరికే ఎన్నో రోజు లయినట్టు అనిపించింది.

ఆరోజు శనివారం. సంతానం బాబాయి ఆఫీసుకు వెళ్ళబోయేముందు చెప్పాను. " రేపు సాయంకాలం బస్‌లో వెళతాను బాబాయ్ ! వెంకట్రావును పంపించి టికెట్ రిజర్వు చేయించు. "

' అదేమిటమ్మా ? ఇన్నాళ్ళకు వచ్చావ్ ! వారం రోజులన్నా వుండకుండా ఎలా వెళ్తావమ్మా ! ' ఆశ్చర్యంగా అన్నారు సంతానంగారు. పిన్ని వచ్చి అందుకొంది.

నేను వెళ్ళకపోతే అక్కడేదో కొంప మునిగిపోతున్న దన్న సాకు వెతికి చెప్పాను. పిన్ని బాబాయిని వెనక్కు

తీసుకెళ్ళి ఏదో మాట్లాడింది. వెంకట్రావును పిలిచి టికెటు రిజర్వేషన్ను గురించి పురమాయించి సంతానంగారు ఆఫీసుకు వెళ్ళిపోయారు.

ఆ మధ్యాహ్నం పిల్లలు మ్యాట్నీకి ప్రోగ్రాం లేవదీశారు. రిక్షాకు ముగ్గురు చొప్పున నాలుగు రిక్షాల్లో వెళ్ళాం. ముప్పై రూపాయలకు పైగా టికెట్లకు అయిపోయినై. హాల్లో కూర్చున్న నాకు పిల్లలు తింటున్న చిప్స్, వేరుసెనగ కాయల మోత తప్ప సినిమా డైలాగ్ విన్పించలేదు.

ఆ తెలుగు సినిమాలో గంపెడు పిల్లలతో సంసారం ఎంత ఆదర్శప్రాయంగా, ఆనందదాయకంగా గడపొచ్చునో మూడు గంటలపాటు చూసి బయటపడ్డాను.

తెల్లవారి ఆదివారం. పిన్ని నాకు వద్దంటున్నా తలంటి పోసింది. ఇంట్లో అంతా పండుగ హడావిడి చేశారు. వంద రూపాయల కొత్త చీర పసుపు, కుంకుమతో పెట్టింది పిన్ని. పిన్ని బలవంతంమీద ఆ చీర కట్టుకున్నాను. ఆప్యాయంగా చూస్తూ నిలబడ్డ బాబాయి పాదాలకు నమస్కరించాను. ఆయన దీవించారు. పిన్ని నిండారా నన్ను చూసుకొని గుండెలకు హత్తుకొంది. నా కళ్ళు చెమ్మగిల్లాయి. అంత పెద్ద సంసారంలోపడి తల మునకలౌతున్న ఆ దంపతుల ఔదార్యానికీ ఆప్యాయతకూ నా హృదయం ద్రవించిపోయింది.

పిన్ని దగ్గర సెలవు తీసుకొని రిక్షా ఎక్కాము. రిక్షా బయలుదేరింది. రిక్షా వెనకే నడుస్తున్న సంతానంగారూ, నా రిక్షా ఒకేసారి ఆగిపోయాయి.

ఎదురుగా వచ్చిన పోలీస్ వాన్ గుమ్మంముందు ఆగింది. సంతానం బాబాయి యింట్లోకన్నా వెళ్ళకుండా పోలీస్ వాన్ ఎక్కి కూర్చున్నారు.

* * *

కోర్టుకు వెళ్ళబోతున్న నాన్నగారు రిక్షా దిగుతున్న నన్ను చూసి ఆగిపోయారు.

'అదేమిటి అరుణా అప్పుడే వచ్చేశావ్?' అన్నారు ఆశ్చర్యంగా.

"నాన్నా, అవసరానికి ఆఫీసు క్యాష్ వాడుకోవటం తప్పా నాన్నా?" అన్నాను.

నాన్న ఓ క్షణం వింతగా నా ముఖంలోకి చూసి అన్నారు — "మామూలు నేరం కాదు. క్రిమినల్ నేరం."

"దానికి శిక్ష ఏమిటి?"

'ఆరు నెలలు జైలు—ఉద్యోగం ఊడడం' అని నాన్నగారు తృప్తిపడ్డట్టయి నా ముఖంలోకి ఓ క్షణం చూశారు.

' ఏమిటమ్మా నువ్వంటున్నది ? సంతానం బాబాయి బాగున్నాడా ? పిల్లలెంత మంది ? పిన్ని ఎలా వుంది ? ' ఏదో ఆలోచిస్తూ అడిగారు.

" సంతానం బాబాయి తలమునక నీళ్ళల్లో ఈతరాని బతుకు బతుకుతున్నాడు నాన్నా. " అన్నాను.

" అంటే ? " నాన్నగారు విస్మయంగా అడిగారు.

" మీరు మేజిస్ట్రేట్ ! ఇంకా ఏం చెప్పాలి ? " అని కళ్ళల్లో నీళ్లు తిరుగుతూ వుంటే గబగబా లోపలకు వెళ్ళిపోయాను.

( 26-12-1969 పొలికేక సచిత్ర వారపత్రిక )